బీసెంట్ థియోసాఫికల్ యూనివర్సిటీ ఏర్పాటుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

మదనపల్లి: రాయలసీమలో ఘన చరిత్ర కలిగిన బీటీ కళాశాలను బీసెంట్ థియోసాఫికల్ యూనివర్సిటీగా మారుస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను వెంటనే అమలుచేయాలని ప్రజా, కులసంఘాల నాయకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. మదనపల్లె బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన నాయకులు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ బీటీ కళాశాలను యూనివర్సిటీగా అభివృద్ధి చేసేందుకు పార్టీలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులతో కలిసి సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కళాశాల మాజీ కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నం మాట్లాడుతూ చెన్నై బీసీటీ ట్రస్ట్ సభ్యులతో మాట్లాడి యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తానన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మదనపల్లె ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సీపీఐ నాయకులు మురళీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాట నిలుపుకోలేని పక్షంలో పోరాటాలకు సిద్ధమని తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటుకు రూ.50 కోట్లు కావాలని గతంలో డీపీఆర్ ఇచ్చారన్నారు. కళాశాలలో కొత్త కోర్సులు ప్రారంభించి, ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తే కార్యరూపం దాలుస్తుందన్నారు. రెడ్డిసాహెబ్, శ్రీచందు, మల్లెలమోహన్ శ్రీనివాసులు, శ్రీనాథ్, నరసింహులు, మాధవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

బి.కొత్తకోట: మండలంలోని కొండకింద కురవపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉజ్జయిని సాంబశివ అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడిగా బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీని బలోపేతం చేస్తానని ఆయన తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

కలకడ: కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు బీఎండీ.సుహేల్, ఎస్‌ఎండీ రెహాన్ జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ మలంషావలి తెలిపారు. విజయవాడ జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఇరువురు విద్యార్థులు ప్రదర్శించిన బయో ఇంజిన్, బయోకెమికల్ క్లీనర్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. పుదుచ్చేరిలో నిర్వహించే విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఆ ప్రాజెక్టు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం సన్నద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మెన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ మలంషావలి, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

ఈవోను సస్పెండ్ చేయాలని ఫిర్యాదు


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పీలేరు: కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరమణపై దురుసుగా ప్రవర్తించిన పీలేరు గ్రామ పంచాయతీ ఈవో గురుమోహన్‌ను విధుల నుంచి తొలగించాలని జిల్లా రెవెన్యూ అధికారి వధుసూధనరావుకు సీపీఐ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు కాపీ అందజేసిన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్.వెంకటేష్ మాట్లాడుతూ బాధ్యతాయుత పదవిలో ఉండి ఓ రాజకీయ నాయకుడిలా ప్రవర్తిస్తూ క్రిందిస్థాయి ఉద్యోగులను చులకనగా మాట్లాడుతున్నారన్నారు. నీవు సర్పంచ్ అనుచరుడివంటూ ముద్ర వేస్తూ వారిపై రాజకీయ బురద చల్లుతున్నారని ఆరోపించారు. సీఐ నాకు ఫ్రెండ్, నా దగ్గర తుపాకీ ఉంది అంటూ భయపెట్టేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఈవోపై విచారణ జరిపాలని కోరారు.

ఈవో తీరుపై విచారణ జరపాలి

పీలేరు పంచాయతీలో వివిధ సమస్యలకు కారణమవుతున్న ఈవో గురుమోహన్ తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈవో గురుమోహన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బోర్డు తీర్మానాలను వ్యతిరేకిస్తూ దురుసుగా ప్రవర్తించడం చేస్తున్నారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరమణను దుర్భాషలాడడం, మరో వ్యక్తిపై దాడి చేయడం జరిగిందన్నారు. వెంకటరమణారెడ్డి, ఆబిద్, రమణ, శ్రీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగరాజనాయక్, సచిన్, నాగభూషణంపాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మదనపల్లి: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మదనపల్లె ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి జి.లోహిత్ ఎంపికైనట్లు చైర్ పర్సన్లు అమృత, శ్రీదేవి తెలిపారు. స్కూల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జార్ఖండ్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జి.లోహిత్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోహిత్‌ను ప్రిన్సిపల్ షహనాజ్‌ఖాన్, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర, పీటీలు మహమ్మద్ అలీ, భానుప్రకాష్, రవి, శబరీష్ అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గుర్రంకొండ: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మృతి చెందడంతో వారి కుటుంబీకులను పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం పరామర్శించారు. మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గంటాభాస్కర్‌రెడ్డి, గుర్రంకొండ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అమీర్ అనారోగ్యంతో మృతిచెందారు. ఆయా గ్రామాలకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వారి మృతదేహాలకు ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సమ్రీన్ ముక్తియార్, ఎల్వీ.రమణ, అప్పల్ల, జయచంద్రారెడ్డి, రెడ్డి నరసింహారెడ్డి, రౌనఖ్ బాషా, నాగేంద్ర, రెడ్డెప్పరెడ్డి, రెడ్డిపీరా పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపిక

తంబళ్లపల్లి: స్థానిక టీఎన్.వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. 2 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చౌడయ్య తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధి కిరణ్‌కుమార్, టాట కేపిటల్ ప్రతినిధి సంతోష్, రాజవర్మ హాజరయ్యారు. టీఓలు నాగరాజు, సురేంద్ర, అశోక్, రెడ్డివర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

తంబళ్లపల్లి: మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉపేంద్ర రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఆర్థిక ఇబ్బందులున్న వారికి వెలుగు పథకం ద్వారా రూ.50 వేల రుణం అందజేయాలన్నారు. సమావేశంలో సుజాత పాల్గొన్నారు.



ఎస్టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పెద్దతిప్పసముద్రం: ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ సర్కార్ స్కూళ్లను బలోపేతం చేయడంతోపాటు టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. శ్రీనివాసులు, నాగరాజు, అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కేఆర్.రెడ్డి, రవి, అశ్విని, అశోక్‌కుమార్, గీత, రెడ్డెప్పరెడ్డి, ప్రియదర్శిని, నజీర్, సీనప్ప తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

పీలేరు రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక కడప మార్గంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. తిరుపతి అన్నపూర్ణ క్యాటరింగ్ వారిచే అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. స్థానిక కోటపల్లె పద్మావతి ఆండాల్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 4.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని ఆలయ చైర్మన్ జీవీ.శ్రీనాథరెడ్డి తెలిపారు. శనివారం గరుడ వాహనంపై విహరిస్తారని చెప్పారు.

రేపు సర్వసభ్య సమావేశం

గుర్రంకొండ: గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

తిరుమలకు పాదయాత్ర

బి.కొత్తకోట: వైకుంఠ ఏకాదశి రతిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు మండలంలోని బీరంగి గ్రామానికి చెందిన 200 మంది భక్తులు బుధవారం కాలినడకన బయలుదేరారు. బి.కొత్తకోటకు చేరుకునే ఈ భక్త బృందం కాండ్లమడుగు, సీటీఎం, వాయల్పాడు, పీలేరు, శ్రీనివాసమంగాపురం మీదుగా తిరుమలకు చేరుకుని శుక్రవారం శ్రీవారిని దర్శించుకుంటారు. ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

మదనపల్లి: మదనపల్లె ఆర్టీసీ-1డిపోలో డిసెంబర్-2024లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బుధవారం అభినందన సమావేశం ఏర్పాటుచేశారు. టార్గెట్ సాధించిన ఎస్.జే.రెడ్డి, కే.ఈశ్వరప్ప, పి.ఆర్.బాషా, ప్రొడక్ట్ ప్రకారం ఎక్కువ ఈపీకే తెచ్చిన జే.ఆర్.సీ.రెడ్డి, టి.రెడ్డెప్ప, పి.ఆర్.బాషా, కె.మల్లికార్జున, ఉత్తమ డిప్యూటీ మెకానిక్ జి.కే.మూర్తి, ఉత్తమ టైర్ ఈడీసీ డి.వి.ఎస్.స్వామి తదితరులకు సీఐ రేవతి ప్రశంసాపత్రాలను అందజేశారు.

భూ సర్వే వివాదం

కలకడ : రెవెన్యూ గ్రామ సభలో అందిన ఫిర్యాదు మేరకు భూమి సర్వే చేసేందుకు రెవెన్యూ శాఖ అధికారులు వెళ్లగా ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో 8 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ గుండావాండ్లపల్లెలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండావాండ్లపల్లె గ్రామానికి చెందిన నాగప్ప నాయుడు కుమారుడు వీర నాగప్ప నాయుడుకు కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లె సమీపంలో నాలుగు ఎకరాల సాగుభూమి ఉంది. ఈ భూమిని సర్వేచేసి హద్దులు చూపాలని రెవెన్యూ గ్రామ సభలో వినతిపత్రం అందించాడు. బుధవారం కలకడ తహసీల్దార్ ఫణికుమార్ రెవెన్యూ సిబ్బందితో పరిశీలించారు. భూమి కొలిచి హద్దులు చూపాలని సిబ్బందిని ఆదేశించారు. భూమి కొలిచే సమయంలో ఇరు వర్గాల వారు ఘర్షణకు దిగారు. వీరనాగప్పనాయుడు, అతని తమ్ముడు బాలనాగప్ప నాయుడు, భార్య కాంతమ్మ, కుమారులు నాగేశ్వర్‌నాయుడు, యశ్వంత్‌లు గాయపడగా మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. చిన్నప్ప వర్గంలో గాయపడిన వారిని కలికిరి మండలం మహల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నప్ప కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరనాగప్పనాయుడు వర్గంలోని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ

మదనపల్లి: ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మదనపల్లె డివిజన్ ఈఈ గంగాధరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారుడు ప్రకృతి వనం ప్రసాద్ కార్పొరేట్ వ్యవసాయం, విద్యుత్ వినియోగానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ గంగాధర్ మాట్లాడుతూ.. విద్యుత్ టారిఫ్‌కు సంబంధించి అభ్యంతరాలుటే ఈ నెల 10వతేదీ కర్నూల్‌లో జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వినియోగదారులు అర్జీలు అందించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ హరికుమార్, ఏఈ(ఐ) ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

పీలేరు.. అభివృద్ధి జోరు

- ప్రధాన పట్టణాలతో పోటీగా విద్య, వ్యాపారాభివృద్ధి
- పుంజుకున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారం


పీలేరు పట్టణం

పీలేరు: ప్రధాన పట్టణాలకు దీటుగా పీలేరు పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. పీలేరు పట్టణం మీదుగా రెండు జాతీయ రహదారులు ఉండడం, ప్రధాన నగరాలకు వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉండడం, రైల్వే స్టేషన్ అందుబాటులో ఉండడం ఇందుకు కారణం. ఎటు చూసినా చిత్తూరు, తిరుపతి, మదనపల్లె, రాయచోటి పట్టణాలకు పీలేరు కేంద్ర బిందువుగా ఉండడం మరో కారణం. పట్టణంలో కొత్తగా రూ.2400 కోట్లతో పీలేరు-మదనపల్లె-తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారి, పీలేరు పట్టణలో రూ.120 కోట్లతో రెండు ఆర్‌వోబీల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. వంద పడకల ప్రభుత్వాస్పత్రి అందుబాటులో ఉంది. పిల్లలు, పెద్దల ఆటవిడుపుకు పీలేరులో పార్కు అందుబాటులో ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే సంస్థలు పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ పీలేరు పుంజుకుంటోంది. పట్టణంలో అధునాతన హాస్పిటల్స్ ఉన్నాయి.

అత్యాధునిక వైద్య సదుపాయం..



పట్టణంలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో రేడియాలజీ డాక్టర్ అందుబాటులో ఉన్నారు. సిటీ స్కాన్, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, టిఫా స్కానింగ్ కలర్ డాప్లర్ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా పీలేరులోనే వైద్య సౌకర్యం ఉంది.

- డాక్టర్ కృష్ణచైతన్యరెడ్డి, స్టార్ లైట్ డయాగ్నొస్టిక్, పీలేరు

క్రమశిక్షణకు మారుపేరు శ్రీచైతన్య కాలేజ్

శ్రీచైతన్య కాలేజ్‌లో క్రమశిక్షణకు మారుపేరుగా విద్యనందిస్తున్నాం. అర్హత, అనుభవం కల్గిన అధ్యాపకులచే విద్యనందిస్తూ ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. తమ కళాశాల విద్యార్థులు అన్నింటా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

- నాగార్జునరెడ్డి, ప్రిన్సిపల్, శ్రీచైతన్య కాలేజ్, పీలేరు

భవిష్యత్తుకు బంగారుబాట శ్రీమేధ

స్థానిక శ్రీమేధ జూనియర్ కళాశాల.. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తోంది. అనుభవం, అంకిత భావం కల్గిన లెక్చరర్లతో విద్యాబోధన జరుగుతోంది. సాధారణ సబ్జెక్టులతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తూ ప్రోత్సహించడం జరుగుతోంది.

- ఎస్.లోకేష్‌బాబు, ప్రిన్సిపల్, శ్రీమేధ కాలేజ్, పీలేరు

అత్యుత్తమ ఫలితాలకు కేరాఫ్ సీఎన్ఆర్

స్థానిక సీఎన్ఆర్ కళాశాలలో వివిధ డిగ్రీ కోర్సులు అంటుబాటులో ఉన్నాయి. ఏటా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. విద్యార్థులకు చదువు చెప్పడంతోపాటు తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఉపాధి కల్పించడం జరుగుతోంది.

- చింతల విజయభాస్కర్‌రెడ్డి, కరస్పాండెంట్, సీఎన్ఆర్ కాలేజ్, పీలేరు













